# "వెఱ్ఱి వెంగళప్పలు"

"ఏవండీ! మన పెళ్ళైయ్యాక ఈ అరవై రోజుల్లో మిమ్మల్ని ఎప్పుడైనా ఒక్క కోరికైనా కోరుకున్నానా?" గోముగా అంది రాగిణి.

నాలుగు కిలోమీటర్ల దూరం సైకిలు తొక్కుకుని వచ్చిన అలసట తీరక ముందే, కొత్తపెళ్ళాం కోరికంటూ బాంబు పేల్చడంతో మరింత నీరసం ముందుకొచ్చింది కల్యాణ సుందరానికి.

అరవై రోజుల్లో ముప్పై రోజులు ఊళ్ళోనే వున్న పుట్టింట్లో గడిపిన విషయం ఇప్పుడు గుర్తుచేయడం వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువగా వుండొచ్చొన్న దూరాలోచనతో ఆ విషయం ప్రస్తావించకుండా భయాన్ని దాచుకుంటూ నంగినవ్వు నవ్వాడు సుందరం.

"అలా నవ్వొద్దు కల్యాణి... ఆ నవ్వు నా గుండెలోకి దూసుకుపోయి నన్ను పిచ్చిదాన్ని చేస్తుంది" అంటూ భర్త కళ్లలోకి రెప్ప వేయకుండా చూస్తూ గుసగుసగా అంది రాగిణి 'గీతాంజలి' లో సిల్క్ స్మిత స్టైల్‌లో.

"నన్ను ఆడపేరుతో పిలవద్దన్నానా?" అని జుట్టు పీక్కోబోయి ఆగిపోయి చుట్టూ అనుమానంగా చూసి "ఎవరూ లేరే... ఎందుకు రహస్యంగా మాట్లాడుతున్నావ్?" అనడిగాడు సుందరం.

"రహస్యంగా కాదురా సుందరీ! హస్కీగా మాట్లాడానన్నమాట" అంది రాగిణి మొగుడి దగ్గరగా వచ్చి చెదిరిన క్రాపును మరింత గారంగా చెరుపుతూ.

చిరాకుగా జుట్టు సర్దుకుని, ఆ చిరాకుని పైకి కనబడనీయకుండా పక్కకు తిరిగి "ఈ చీరెలో భలే అందంగా వున్నావోయ్" అంటూ కుర్చీలో కూలబడ్డాడు సుందరం.

"నేనేం కట్టుకున్నానో కూడా సరిగ్గా చూడరన్నమాట! దీనిని మ్యాక్సీ అంటారు. చీరె అనరు" ముద్దుగా కోప్పడింది.

"సరే ఏడు గంటలవుతోంది. కాస్త కాఫీ లాంటిది ఇస్తావా?" అడిగాడు సుందరం దీనంగా.

'ఆ అపుడే ఏడుగంటలయిపోయిందా? ఇక అయిదు నిముషాలే వుంది.. నేను చెప్పేది వినండి" హడావుడి పడింది రాగిణి.

కంగారుగా కుర్చీలో నుండి లేచాడు సుందరం. "అయిదు నిముషాలేమిటి? ఏవన్నా అఘాయిత్యం చేసావా ఏమిటి? నీకేం తక్కువ చేసాను? నన్ను అన్యాయం చేసిపోకు రాగిణి..." రాగిణిని గట్టిగా పట్టుకుంటూ దీనంగా అన్నాడు.

"హయ్యో... మూడు నిమిషాలే వుంది... చెప్పేస్తున్నా వినండి... ఫ్లాస్క్‌లో కాఫీ వుంది. డబ్బాలో కారప్పూస వుంది. టేబులు మీద పొద్దున్నే వండేసిన భోజనం సిద్ధంగా వుంది. ఏడుగంటల నుండి తొమ్మిదిన్నర దాకా నన్ను పలకరించకండి. మీకు కావలసివి పెట్టుకుని తినండి. "అనేసి బెడ్‌రూమ్‌లోకి పరిగెత్తింది రాగిణి.

సుందరానికి దిక్కుతోచలేదు. తనేం తప్పు చేసాడు? ఏమిటిదంతా? అన్నం వడ్డించుకుని తినేయమంది అంటే తను భోజనం చెయ్యదా? తొమ్మిదిన్నర డెడ్‌లైను దేనికి? జవాబు దొరకని ప్రశ్నలతో తలనొప్పి రాగా నెమ్మదిగా తనూ పడక గదిలోకి నడిచాడు.

గదిలో టి.వి. ముందర సెటిలయిపోయి వుంది రాగిణి. ఆవిడ చేతిలో పేపరు, పెన్నూ సిద్ధంగా వున్నాయి. సుందరం లోపలికి రాగానే 'వుష్' అంటూ నోటిమీద వేలువేసుకుంది. 'మాట్లాడొద్దు, డిస్టర్బ్ చెయ్యొద్దు' అన్నట్టుగా.

ఈ బిల్డప్ అంతా దేనికో అర్థం కావడం లేదు సుందరానికి. 'కొంపదీసి నాలుగు సీరియల్స్ వరుసగా రాయాలనుకుంటుందా?' అనుకుంటూ టి.వి. కేసి చూసాడు ఆశ్చర్యంగా.

రాగిణి మామూలుగా చూసే ఛానల్ కాదు అది. ఏదో కొత్తది కానీ తెలుగు సీరియల్స్ వస్తున్నాయి. 'మీదీ కాదు మాది కాదు' అన్న ఛానల్ లోగో వెనకాల స్క్రీన్ మీద కనబడగానే 'ఓహో' అనుకున్నాడు.

'ఇదేదో చూద్దాం... తనే చెప్పక పోతుందా' అనుకుంటూ వంటింట్లోకి వెళ్ళి ఫ్లాస్కులో కాఫీ గ్లాసులోకి వంపుకుని కారప్పూస ప్లేట్లోకి తీసుకుని మళ్ళీ పడక గదిలోకి వచ్చి కూర్చున్నాడు.

పెళ్ళికి ముందే కాబోయే మొగుడి వదిన గారి మీద పగతో ద్వేషంతో రగిలిపోయే పెళ్ళికూతురు కథ ఏదో వస్తోంది.

"అదేమిటి రాగిణి! 'ఆడపిల్లనే కను' నిప్పుసాక్షి' నీ కిష్టమైన సీరియల్స్ కదా.. అవి వదిలేసి ఇది పెట్టావెందుకు?".... కారప్పూస పరపర నములుతూ వుత్సుకత ఆపుకోలేక అడిగాడు సుందరం.

టి. వి. మీద నుండి కళ్ళు తిప్పకుండానే 'చాలు' అన్నట్టు చెయ్యి చూపించింది రాగిణి.

"అదిగో మొదటి అక్షరం వచ్చింది. 'కుర్చీలో నుండి లేచి గంతు వేసినంత పనిచేసి పేపరు మీద ఆ అక్షరం రాసుకుంది. 'ల్' అనే అక్షరం అది.

ఇంతలో అడ్వర్‌టైజుమెంట్ మొదలైంది. "కారప్పూస చప్పుడూ కాకుండా తినండి.. నా కాన్సన్‌ట్రేషన్ దెబ్బ తింటోంది." అంది రాగిణి కళ్ళు రెండూ టి.వి. తెరకు అంకితం చేస్తూ.

"సరే విషయమేమిటో చెప్పు. సస్పెన్స్‌తో ఛస్తున్నాను." బ్రతిమాలాడు కల్యాణ సుందరం టెన్షను భరించలేక.

"బ్రేక్ సమయంలోనైనా ఇటు చూడొచ్చు కదా?" అని కూడా అడిగాడు.

"ఏమో... ప్రకటనలు వచ్చేటప్పుడే ఇంకో అక్షరం వచ్చేస్తే... మిస్సయిపోనూ... మీకు ఇప్పుడు తెలియదు నా మనసంతా మీదే అని. మీ సుఖమే నేను కోరుతున్నాననీ... రేపు మారుతి కార్లో తిరిగినపుడు అర్థం అవుతుంది" అంటూ ఎమోషనల్‌గా మాట్లాడింది రాగిణి. టి.వి. స్క్రీన్ మీద నుండి దృష్టి మరల్చకుండా.

అంతలోనే 'కెవ్' అంటూ లోకాతీతమైన కేక పెట్టింది "చెప్పానా అదిగో అక్షరం..." అంటూ.

సుందరం వీపు మీద చరుచుకుని, లాల్చీ లోకి 'థూ థూ' అనుకుని టి.వి. వైపు చూసాడు 'ష్ణ' అన్న అక్షరం. పెద్దగా కనబడుతోంది. అక్షరం రాసుకోవడంలో మునిగిపోయిన రాగిణి తన అరుపుకి మొగుడు ఝడుసుకోవడం కూడా గమనించలేదు.

మళ్ళీ "ల్" 'ష్ణ' తో అర్థవంతమైన పదాలు ఏమొస్తాయో ఆలోచిస్తూ వుండండి. మనకి అరగంటే టైము. తొమ్మిదిన్నర దాకా వచ్చే అక్షరాలన్నీ కలిపి ఏ పదమో మనం ఫోను చేసి చెప్పాలి. అదీ తొమ్మిదిన్నర నుండి పదిలోపుగానే." అంటూ ఈసారీ 'కెవ్' అనే అరుపుకి ప్రత్యామ్నాయంగా ఒక గంతువేసి టి.వి.లో 'మీరు మాకు ఫోను చేసి చెప్పాల్సిన నంబర్లు' అంటూ వస్తున్న ఒక సెల్ నెంబరు, రెండు ఫోను నంబర్లూ గబగబ రాసుకుంది.

ఎనిమిద్నిర అయ్యేసరికి సుందరంకు ఆకలేసింది. "నీకు అన్నం కలిపి తీసుకురానా?" ప్రేమగా అడిగాడు.

'మాట్లాడొద్దు' అన్నట్టు సైగ చేసింది రాగిణి. సుందరం వెళ్ళి భోజనం చేసి వచ్చేసరికి మరో నాలుగు అక్షరాలు రాసుకుంది రాగిణి.

అవన్నీ మరో పేపర్లో రాసుకోమని సైగలతో చెప్పింది భర్తకు. బుద్ధిగా అవన్నీ రాసుకున్నాడు సుందరం. 'ల్', ష్ణ, ని, లా, ద్వా, లా' అని వున్న ఆ అక్షరాల వైపు చూస్తూ వుండిపోయాడు. బుఱ్ఱ బద్దలు కొట్టుకున్నా అదేమిటో, అర్థం మేమిటో పాలుపోలేదు అతనికి.

టి.వి. వెనకాల వున్న గడియారం తొమ్మిదింపావు చూపిస్తోంది. "ఇంకో పదిహేను నిముషాలు" ట్రాన్స్‌లో వున్నట్టుగా అంది. 'హోఫెనవర్‌మోర్' అనే చిన్న నాటి టీచరు, తోడుగా లెక్కల పరీక్ష గుర్తొచ్చి చెమట్లు పట్టాయి సుందరానికి.

'అ' అంటూ మరో అక్షరం కనబడింది తెరమీద సుందరం బుఱ్ఱలో ఏదో మెరిసినట్టయి నోరు తెరవబోయాడు.

'ఉష్' అంటూ ఆఖరి బిట్ రాసే విద్యార్థినిలా... ఊపిరి బిగపట్టింది రాగిణి. ఈసారి 'కృ' అన్న అక్షరం రాగానే ఉత్సాహం ఆపుకోలేక ఆర్కి మెడీస్ తాతలా అరిచాడు సుందరం "లాల్ కృష్ణ అద్వానీ" అని.

"అయ్యో... ఫోనండి... నంబరు దొరకదు" అంటూ రాగిణి అరవటంతో ఇద్దరూ ఫోను దగ్గరికి పరిగెత్తారు.

"ముందు సెల్ ట్రై చేయండీ" కంగారుగా అంది. "లైన్లన్నీ బిజీగా వున్నాయి. కాసేపాగి ప్రయత్నించండి" అన్న కలకంఠి కంఠం వినగానే ఫోను పెట్టేసి 'లైన్స్ బిజీట' అన్నాడు సుందరం.

"అయ్యో... టైమయిపోతోంది. మామూలు ఫోను ప్రయత్నించండి. ఒకదాని తరువాత ఒకటి.. నా వైపు అలా మొద్దులా చూసి చెప్పకండి" టెన్షన్‌లో మొగుడన్న విషయం మర్చిపోయి విసుక్కుంది రాగిణి.

"ఈ నంబరుతో ప్రస్తుతం ఏ టెలిఫోనూ పనిచేయడంలేదు" అని ఒకసారి... "మీరు డయల్ చేసిన నంబరు ఒకసారి సరిచూస్కోండి' అని మరోసారీ వస్తున్నాయి.

గడియారం మీద సెకండ్ల ముల్లు కదులుతుంటే తన గుండెల్లో టైంబాంబు టిక్ టిక్‌లు వినిపించినంత ఆదుర్దాగా వుంది రాగిణికి.

సుందరం చేతిలో నుండి ఫోన్ లాక్కుని తనే గబగబ నంబర్లు నొక్కింది రాగిణి.

మళ్ళీ 'డిటో' రెస్పాన్స్ వచ్చింది. 'ఈ వైపు లైన్లన్నీ బిజీగా వున్నాయి. కాసేపాగి ట్రై చేయండి' అని ఒకసారి. 'ఈ నంబరుతో ప్రస్తుతం ఏ టెలిఫోనూ పనిచేయడంలేదు' అని మరోసారి 'మీరు డయల్ చేసిన నంబరు ఒకసారి సరిచూసుకోండి' అని ఇంకోసారి వచ్చింది.

గడియారం నెమ్మదిగా పది గంటలు అయినట్లు పాట పాడింది.

రాగిణి ముఖం నిరాశతో నిస్పృహతో వాడిపోయింది. పట్టలేనంత కోపం కూడా వచ్చింది.

గుమ్మందాకా వచ్చిన మారుతీ కారు రయ్యిన వెనక్కి పోయిందన్న ఊహ మనసును మండిస్తుండగా...

"అంతా బోగస్... నంబర్లన్నీ కావాలని తప్పు ఇవ్వడమో లేక ఫోను పక్కన పెట్టేయడమో చేసి వుంటారు..." అంటూ టి.వి. వాళ్ళ మీద మండిపడటం మొదలు పెట్టింది.

కల్యాణసుందరానికి జాలేసింది. "పోనీలే రాగిణి. మొన్న మనం అదేదో పుస్తకంలో ఫోటోలకు కాప్షన్ రాసి పంపించాం కదా 'అక్కడ అది ఇక్కడ ఇది' అని... " దానికి గ్యారంటీగా ప్రైజు వస్తుందిలే..." అన్నాడు ఓదార్పుగా.

"మీదీ కాదు మాదీ కాదు" ఛానల్ అంత వరకు వస్తున్న సీరియల్, 'మీ మొహాలకు ఈ రోజుకిది చాల్లే –' అన్నట్టు తన రెండో భర్త చేసుకోబోయే మూడో పెళ్లిని భగ్నం చేయటానికి పథకం రచించిన కథానాయిక వికృతంగా నవ్వుతుండగా ఫ్రేమ్ ఫ్రీజ్ చేయబడింది.

"ప్రేక్షకుల విశేష ఆదరాభిమానాలు చూరగొన్న 'వెట్టివెంగళప్పలు' ఇంత వరకూ చూసారుగా, ఇక ఈ వారం ప్రశ్న. 'తన రెండో భర్త చేసుకోబోయే మూడో పెళ్లిని కథానాయిక ఎలా భగ్నం చేస్తుంది?' సరైన సమాధానం రేపటిలోగా మాకు రాయండి! రెండు కేజీల వెండి గెలుచుకోండి!" అంటూ అరుస్తోంది టి.వి. యాంకర్.

పళ్ళు నూరుతూ టి.వి. ఆఫ్ చేసి నీరసంగా మంచంమీద వాలిపోయింది రాగిణి.

**"హాసం" హాస్య, సంగీత పత్రిక**

తేది : నవంబరు, 2004.